

## డీసీసీ అధ్యక్ష పదవి నుంచి అంబటి ఔట్

- నిధులు దుర్వినియోగం నిజమని హైకమాండ్ నిర్ధారణ
- ఆదేశాలు జారీ చేసిన పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి

శ్రీకాకుళం, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)అధ్యక్ష పదవి నుంచి అంబటి కృష్ణారావును తొలగించేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నిధులను ఆయన దుర్వినియోగం చేశారని కొద్దిరోజుల క్రితం కార్యకర్తలు, నాయకులు హైకమాండ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై (మిగతా 6వ పేజీలో..)

## పాఠశాలలకు పండుగ

- మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- తల్లిదండ్రులకు క్రీడలు, రంగవల్లుల పోటీలు



రెడ్డికపేట పాఠశాలలో ఫొటోబూత్ ఏర్పాటు

శ్రీకాకుళం/నరసన్నపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలో గురువారం మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్ నిర్వహించనున్నారు. పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో 3,017 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 165 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు 3.04లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఇప్పటికే ఉపాధ్యాయులు ఆహ్వానం పలికారు. తరగతి గదులను మామిడి తోరణాలు, బెలూన్లతో అలంకరించారు. రంగవల్లులతో తీర్చిదిద్దారు. గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి నిర్వహిస్తారు. విద్యార్థి ప్రగతి నివేదికతో పాటు ప్రవర్తన, అభివృద్ధి సామర్థ్యాలపై చర్చిస్తారు. విద్యార్థుల తల్లులకు రంగోలి, లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేస్తారు. విద్యార్థుల పేరుమీద తల్లిదండ్రులతో మొక్కలు (మిగతా 6వ పేజీలో..)


దబ్బపాడులో వృద్ధురాలితో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గోవిందరావు

## అభివృద్ధే లక్ష్యం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- దబ్బపాడు, వాడవలసలో పర్యటన

ఎల్.ఎన్.పేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తూ.. రాజకీయాలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందజేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎల్.ఎన్.పేట మండలంలోని దబ్బపాడు గ్రామంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు (మిగతా 6వ పేజీలో..)

## రేషన్ కావాలంటే.. 8 కి.మీ. వెళ్లాలి



> మెళియాపుట్టి మండలం కేరాశింగి, గూడ గ్రామాల్లో 83 కుటుంబాలు ఉన్నాయి. ఆయా కుటుంబాల్లో గిరిజనులు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న డబారు జీసీసీ డిపోకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి వస్తోంది. రేషన్ బియ్యంతో కాలినడకన కొండలు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు వాపోతున్నారు.

- కొండపై ఉన్న గిరిజనులకు తప్పని కష్టాలు
- సిగ్నల్స్ సక్రమంగా లేక అవస్థలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి

మెళియాపుట్టి జూలై 9(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో రేషన్ సరుకుల కోసం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేషన్ దుకాణాలు దూరంగా ఉండడంతో కొండపై నుంచి కిందకు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ సరుకుల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీని రద్దు చేసింది. డిపోల్లో రేషన్ డీలర్ల ద్వారా సరుకులు అందజేస్తోంది. మారుమూల గిరిజన గ్రామాల్లో జీసీసీ డిపోల ద్వారా రేషన్ సరుకులు ఇస్తోంది. కాగా, అక్కడ సిగ్నల్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చెట్లు, కిటికీలకు సెల్‌ఫోన్లు వేలాడదీసి.. అక్కడ నుంచి వైఫై ద్వారా బయోమెట్రిక్ వేయిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో సర్వర్ పనిచేయకపోవడంతో రోజంతా నిరీక్షణ తప్పడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 16 మండలాల్లో 676 గ్రామాలు ఉన్నాయి. మెళియాపుట్టి మండలంలో అడ్డివాడ, కేరాశింగి, గూడ, చందనగిరి, దబ్బగూడ తదితర గ్రామాలు కొండపై ఉన్నాయి. ఆయా గ్రామ గిరిజనులంతా రేషన్ సరుకుల కోసం కొండ దిగి ఆరేడు కిలోమీటర్లు రాకపోకలు సాగించాల్సిందే. హిరమండలం మండలంలో కిరిడివలస, బొంగిగూడ, మిర్రిగూడ గ్రామాలు కొండపై ఉన్నాయి. సారవకోట మండలంలో అశోకం, బురుజువాడ, గూడ, బొంతుగూడ గ్రామాల గిరిజనులు కూడా కొండపైనే జీవనం (మిగతా 6వ పేజీలో..)

### చర్యలు తీసుకుంటాం

జీసీసీ డిపోలో సర్వర్‌తోపాటు సిగ్నల్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. గిరిజన గ్రామాల్లోకి రేషన్ సరుకులు తీసుకెళ్లాలని ప్రభుత్వం ఆదేశిస్తే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాం.

\- నర్సింహులు, జీసీసీ మేనేజర్, పాతపట్నం

> మెళియాపుట్టి మండలం అడ్డివాడ గ్రామంలో 36 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. వీరికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బందపల్లి జీసీసీ డిపోలో రేషన్ సరుకులు అందించేవారు. ప్రస్తుతం ఈ డిపో భవనం శిథిలావస్థకు చేరడంతో.. మరో కిలోమీటరు దూరంలో ఉన్న రామచంద్రపురం పాత రైతుభరోసా కేంద్రంలో రేషన్ సరుకులు అందజేస్తున్నారు. గత నెల నుంచి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని అడ్డివాడ గిరిజనులు పేర్కొంటున్నారు. కొండపై ఉన్న తమ గ్రామం నుంచి నాలుగు కిలోమీటర్లు నడిచి నర్సింగపల్లి చేరుకుని, అక్కడి నుంచి ఆటోలో మరో నాలుగు కిలోమీటర్లు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. అక్కడ కూడా సిగ్నల్స్ సక్రమంగా లేకపోవడంతో రోజంతా నిరీక్షిస్తున్నామని పేర్కొంటున్నారు.


రామచంద్రపురం జీసీసీ డిపో వద్ద నిరీక్షిస్తున్న గిరిజనులు(ఫైల్)

### నిరీక్షిస్తున్నాం



రేషన్ సరుకుల కోసం కొండ దిగి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రామచంద్రాపురం జీసీసీ డిపోకు వెళ్లాం. ఉదయమంతా సర్వర్, సిగ్నల్ సమస్య కారణంగా నిరీక్షించాం. సాయంత్రానికి భోజనాలు లేక ఇబ్బంది పడుతూ కొండపై ఉన్న మా గ్రామానికి చేరుకున్నాం.

\- సవర గౌరమ్మ, అడ్డివాడ, మెళియాపుట్టి

## ఇద్దరు బాలింతల మృతి

- డాక్టరు నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన
- యలమంచిలి, పాగోడు గ్రామాల్లో విషాదం


అరుణ, ధనలక్ష్మి (ఫైల్)



జలుమూరు(సారవకోట), జూలై 9(ఆంధ్రజ్యోతి): వైద్యురాలి నిర్ల క్ష్యం కారణంగా ఇద్దరు బాలిం తలు మృతి చెందారంటూ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆరోపించారు. వైద్యురాలి తీరును నిరసిస్తూ మృతదేహాలతో ఆందోళన చేశారు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జలుమూరు మండలం యలమంచిలికి చెందిన పట్ట అరుణ(23), పాగోడు గ్రామానికి చెందిన నార ధనలక్ష్మి(22) అనే బాలింతలు మంగళవారం రాత్రి శ్రీకాకుళంలోని రిమ్స్‌లో చికిత్స పొం దుతూ మృతి చెందారు. వీరిద్దరూ పురిటినొప్పులతో బుడితి సామాజిక ఆస్పత్రిలో చేరారు. సోమవారం డాక్టర్ బాన్న శోభారాణి వీరిద్దరికీ ఆపరేషన్ చేయగా ఇద్దరు మగబిడ్డలు జన్మించారు. ఆపరేషన్ తర్వాత అరుణ, ధనలక్ష్మికి ఓవర్ బ్లీడింగ్‌తో పాటు యూరిన్ ఆగిపోయి పరిస్థితి విషమించింది. దీంతో వారిద్దరినీ శ్రీకాకుళంలో రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఇద్దరూ మరణించారు. బుడితి సీహెచ్‌సీలో వైద్యాధికారి నిర్లక్ష్యం కారణంగా వారిద్దరూ మృతి చెందారని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆరోపించారు. బుధవారం బుడితి, పాగోడు కూడలి సమీపం లో మృతదేహాలతో ఆందోళన చేశారు. నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ అశోక్‌బాబు సంఘటనా స్థలాలకు చేరుకుని మృతుల కుటుంబ సభ్యులతో మాట్లా డారు. న్యాయం చేస్తామని సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. కాగా, ఈ ఘటనపై మృతుల కుటుంబాల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌చార్జి ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

### కుటుంబ సభ్యుల్లో విషాదం

- అరుణ స్వస్థలం అల్లాడపేట. రెండేళ్ల కిందట యలమంచిలికి చెందిన పట్ట గోవిందరావుతో వివాహమైంది. ఈ దంపతులకు తొలికాన్పులో ఓ పాప జన్మించింది. రెండోకాన్పులో బాబు జన్మించిన కొద్ది గంటల్లోనే అరుణ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. అలాగే (మిగతా 6వ పేజీలో..)


పాగోడు కూడలి వద్ద ఆందోళన చేస్తున్న ధనలక్ష్మి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు

## కార్మిక హక్కులను పరిరక్షించాలి

- నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

అరసవల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దాడిని కార్మికులంతా ఐక్యంగా తిప్పికొట్టి.. పరిరక్షించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా శ్రీకాకుళంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు మహాధర్నా నిర్వహించారు. స్థానిక డైమండ్ పార్కు నుంచి ఏడురోడ్లకూడలి వరకు ర్యాలీ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి. స్కీం వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి. ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలి. దశాబ్దాలపాటు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని నిర్ణయించడం దుర్మార్గం. రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసీ, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్‌లకు అప్పనంగా అప్పగిస్తే చూస్తూ ఊరుకునేది లేదు. కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయకపోతే పోరాటాలు తీవ్రతరం చేస్తామ'ని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ టి.ప్రకాష్, ఏఐటీయూసీ నాయకులు సీహెచ్ గోవిందరావు, తిరుపతిరావు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం.క్రాంతి, రైతు కూలీ సంఘం కార్యదర్శి టి.అరుణ, మునిసిపల్, ఏపీఎంఎస్ఆర్‌యు, భవన నిర్మాణ, హమాలీ, రిమ్స్ ఏఆర్ఎస్, నీలం జ్యూట్, స్మార్ట్‌కెమ్, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఏఐటీయూసీ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

## మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం దోహదపడుతుందని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యంగా మధ్యవర్తిత్వ ప్రక్రియను మరింత సమర్థంగా నిర్వహించాలని న్యాయవాదులకు తెలిపారు. మధ్యవర్తిత్వంలో కక్షిదారులతో ప్రవర్తించే తీరు, నడవడిక.. తదితర విషయాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం మధ్యవర్తిత్వం సీనియర్ ట్రైనర్ వి.పి.తనకచన్, పి.జి.సురేష్ మధ్యవర్తిత్వంతో ప్రయోజనాలు, ఎదురయ్యే సవాళ్లను చర్చించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, మధ్యవర్తిత్వం న్యాయవాదులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

ఐదు తరగతులు..
మూడు గదులు 6లో
- వరండాల్లో బోధనతో అవస్థలు
- ఇదీ నర్సింగపల్లి ప్రాథమిక పాఠశాలలో పరిస్థితి

ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు 6లో
- ఆర్జేయూకేటీ డైరెక్టర్ డా.బాలాజీ

నత్తనడకన నీటితీరువా వసూళ్లు
- జిల్లాలో రూ.20.27 కోట్ల బకాయిలు 8లో

## విమానాశ్రయం ఏర్పాటుకు 'హడ్కో' రుణం

- మంత్రి మండలి ఆమోదం

శ్రీకాకుళం, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకుగాను 'హడ్కో' రుణం మంజూరు చేసేందుకు మంత్రి మండలి ఆమోదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతిలో బుధవారం కేబినేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'పరిశ్రమలు-మౌలిక సదుపాయాల శాఖ' పరిధిలో... ఏపీ విమానాశ్రయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌కు ప్రభుత్వ షార్ట్‌ఫాల్ గ్యారెంటీ అందించేందుకు, ఏపీఏడీసీఎల్‌కు 'శ్రీకాకుళం'తోపాటు కుప్పం, దగదర్తి, అమరావతి విమానాశ్రయాల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు రుణాన్ని 'హడ్కో' నుంచి సమకూర్చే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

## సింహ'గిరి ప్రదక్షిణ'కు పోటెత్తిన భక్తులు

6లో


జెండా ఊపి సింహగిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న సింహాచలం ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు

# సింహ'గిరి ప్రదక్షిణ'కు పోటెత్తిన భక్తులు



పూజలందుకుంటున్న సింహాద్రి అప్పన్న స్వామి



సింహగిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తజనం

సింహాచలం, జూలై 9(ఆంధ్రజ్యోతి): హరి నామస్మరణ నడుమ బుధవారం సింహ'గిరి ప్రదక్షిణ' ప్రారంభమైంది. ఆషాఢమాస శుక్లపక్ష చతుర్దశినాడు సింహగిరి చుట్టూ సుమారు 32 కిలోమీటర్ల మేర భక్తులు ప్రదక్షిణ చేయడం అనాదిగా వస్తోంది. ఏటా మాదిరిగానే బుధవారం మధ్యాహ్నాం రెండు గంటలకు కొండదిగువన తొలిపావంచా వద్ద స్వామివారి పుష్పతేరు (ప్రచార రథం)కు ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనంతో సింహాచలం గోశాల కూడలి నుంచి పాతఅడివివరం, ముడసర్లోవ, హనుమంతువాక జంక్షన్ వరకూ రహదారి కిటకిటలాడింది.



ప్రదక్షిణలో ఉత్సాహంగా..



ఎండ, వానల నుంచి ఛత్రాలతో రక్షణ పొందేలా..



ప్రదక్షిణకు శ్రీకారం చుడుతూ తొలిపావంచా వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



ప్రదక్షిణలో పాల్గొన్న యువతరం



సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు



సింహాచలం తొలిపావంచా వద్ద స్వామివారి చెంత కుటుంబ సభ్యులతో కలిసి కొబ్బరికాయలు కొడుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

## ఐదు తరగతులు.. మూడు గదులు

- వరండాల్లో బోధనతో అవస్థలు
- ఇదీ నర్సింగపల్లి ప్రాథమిక పాఠశాలలో పరిస్థితి



వరండాలో బోధిస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): నర్సింగపల్లి ప్రాథమిక పాఠశాలలో సమస్యలు తిష్ఠ వేశాయి. ఇక్కడ ఐదు తరగతులకు మూడు గదులు ఉండడంతో వరండాలో బోధించాల్సి వస్తోంది. నర్సింగపల్లి ప్రాథమిక పాఠశాలలో 54మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంకా మరో పదిమంది వరకు విద్యార్థులు చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరి బోధనకు నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. గతంలో నాడు-నేడు పథకం ద్వారా నిధులు మంజూరైనా గదులు నిర్మించకపోవడంతో ప్రస్తుతం అవస్థలు తప్పడం లేదు. ఇక్కడి పాఠశాలలో తమ పిల్లలను చేర్పించడానికి పలువురు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఇంకా ఎన్‌రోల్‌మెంట్ పెరిగే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇక్కడ ఏడు దశాబ్దాల కిందట నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం ఆ భవనం వినియోగంలో లేకపోయినా విద్యార్థులు అటువైపు వెళ్లే సమయంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ప్రస్తుత అవసరాలకోసం మరో భవనాన్ని నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి స్పందన కరువవుతోంది. వంటశాల లేకపోవడంతో ఆరుబయటే వంటలు చేయాల్సివస్తోంది. నిర్మాణానికి స్థలం లేకుండాపోయింది. ప్రధానంగా మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినుల అవస్థలకు గురవుతున్నారు. పాఠశాల ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడ స్థలం కొరత వల్ల కొత్త భవనాలు నిర్మించాలంటే శిథిలావస్థకు చేరిన భవనాలు కూలగొట్టాల్సి ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పెట్రో కెమికల్స్ రిఫైనరీ ఏర్పాటుకు స్థల పరిశీలన

టెక్కలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలంలోని మూలపేట పోర్టుకు సమీపంలో పెట్రో కెమికల్స్ రిఫైనరీ ఏర్పాటుకు హెచ్‌ఎంఈఎల్ పరిశ్రమ ప్రతినిధులు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. రెండువేల ఎకరాల పరిధిలో రూ.50వేల కోట్ల పెట్టుబడితో రిఫైనరీ ఏర్పాటుక ఆ సంస్థ ప్రతినిధులు ముందుకొచ్చారు. ఈ మేరకు సమీర్‌పేట లాజిస్టిక్స్‌కు చెందిన 1,800 ఎకరాల ఉప్పు భూమును ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వీరికి పవర్ పాయింట్ ప్రెజేంటేషన్ ద్వారా ఏయే వనరులు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వివరించారు. ప్రధానంగా రైలు, రోడ్డు కనెక్టివిటీ, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయం కల్పించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే పోర్టు ప్రాంతంలో సౌత్‌బ్రేక్ బెర్త్‌ల నిర్మాణాన్ని మిటల్ గ్రూప్ ప్రతినిధులు పరిశీలించారు. ఇప్పటికే కోల్‌కత్తాకు చెందిన హల్దియా పెట్రో కెమికల్స్, పూణేకు సంబంధించిన కళ్యాణి స్టీల్స్, యూకేకు చెందిన గ్రీన్ అమోనియా పరిశ్రమ యాజమాన్యం, అమెరికాకు చెందిన ఎగ్జాంబుల్ ప్రతినిధి బృందం సంతబొమ్మాళి మండలం పరిధిలో పోర్టు చుట్టూ ఉన్న భూములను పరిశీలించిన విషయం విదితమే. ఆయా మల్టీనేషనల్ కంపెనీలు ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వనరులు కోసం ఇప్పటికే అన్వేషణ చేపట్టాయి. పోర్టుకు దగ్గరగా పెట్రో కెమికల్స్ రిఫైనరీ ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉండడంతో పరిశీలించారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి రెవెన్యూ అధికారుల బృందంతో కలిసి హెచ్‌ఎంఈఎల్ పరిశ్రమ ప్రతినిధులకు పరిశ్రమ ఏర్పాటుకు వనరులు ఆవశ్యకత వివరించారు.



పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

## శ్రీకాకుళం రెడ్‌క్రాస్‌కు ఉత్తమ సేవా పతకం

- గవర్నర్ నుంచి అందుకున్న కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీకి ఉత్తమ సేవా పతకం లభించింది. విజయవాడలో బుధవారం జరిగిన రాష్ట్ర రెడ్‌క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. జిల్లా రెడ్‌క్రాస్ ద్వారా అందించిన విస్తృత సేవలకు ఈ పతకం లభించింది. అలాగే 2022-23 సంవత్సరంలో ఉత్తమ జిల్లా పురస్కారాన్ని రెడ్‌క్రాస్ ట్రెజరర్ కె.దుర్గాశ్రీనివాస్ స్వీకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడి రామారావు, వైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సెక్రటరీ ఏకే ఫరీడా, కోశాధికారి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.





గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి ఉత్తమ సేవా పతకం అందుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అడవిని తలపిస్తున్న రిట్టపాడు వద్ద దేశబట్టీ కాలువ

## అడవి కాదు.. కాలువే!

వజ్రపుకొత్తూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఈ ఫొటో చూస్తుంటే ఏదో రిజర్వ్ ఫారెస్టులా ఉంది కదూ.. అలా అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్టే. ఎందుకంటే ఇది దేశబట్టీ కాలువ. రిట్టపాడు వద్ద ఈ కాలువలో పిచ్చిమొక్కలతో నిండిపోయి అడవిని తలపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం పూడికలు కూడా తీయకపోవడంతో ఇలా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ ప్రాంత రైతులు ఈ కాలువ ద్వారా వచ్చిన నీటిని చెరువులు నింపుకుని పంటలు పండిస్తుంటారు. అలాగే కాలువను ఆనుకొని ఉన్న వంతెన కిందభాగంలో నీటితో వచ్చే చెత్తచేదారం నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువులో పేరుకుపోయిన పూడికను తీయించాలని రైతులు కోరుతున్నారు.

### పాఠశాలలకు పండుగ

(ఐదో పేజీ తరువాయి)

నాటిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఫొటో బూత్‌లో ఫొటోలు తీసుకుంటారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద పెద్దలందరూ విద్యార్థులతో కలిసి భోజనం చేయనున్నారు. అలాగే మెగా పేరెంట్స్ డే నాడు రెండో విడత తల్లికి వందనం పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.13వేలు చొప్పున జమ చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

**గిన్నిస్ రికార్డు కోసం..**

జిల్లావ్యాప్తంగా 1,25,000 మొక్కలు నాటేందుకు సిద్ధం చేసేశారు. మెగా పేరెంట్స్ మీటింగ్ కోసం నిధులు కూడా విడుదల చేశారు. 30సెకెన్ల వీడియో.. మూడు ఫొటోలను నమోదు చేస్తున్నారు. ఇదంతా మొత్తం పది లక్షల మందితో నిర్వహించినందుకుగాను గిన్నీస్ రికార్డులో నమోదు చేసేందుకు వీలుంటుంది. విద్యార్థులు సైతం కొత్త యూనిఫాంతో నేడు హాజరుకానున్నారు. ఏర్పాట్లను పక్కాగా చేపట్టామని.. విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డా. తిరుమల చైతన్య పిలుపునిచ్చారు.

### ఇద్దరు బాలింతల మృతి

(ఐదో పేజీ తరువాయి)

పాగోడు గ్రామానికి చెందిన ధనలక్ష్మికి ఆమదాలవలస మండలం కుసిమివలసకు చెందిన నార సంతోష్‌తో ఏడాది కిందట వివాహమైంది. ప్రసవం కోసం రెండు నెలల కిందట కన్నవారింటికి వచ్చింది. తొలికాన్పులో కుమారుడు జన్మించాడని ఆనందించేలోపు.. ఆమె మృతి చెందడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

- వైద్యాధికారి శోభారాణి కురుపాం(పార్వతీపురం మన్యం జిల్లా) ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బదిలీపై బుడితి సీహెచ్‌సీకి గత నెల 28న వచ్చారు. బాధ్యతలు చేపట్టిన రెండు వారాల్లోనే ఇద్దరు బాలింతలు మృతి చెందడంతో పరిసర గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఆపరేషన్ సమయంలో తాను ఎటువంటి నిర్లక్ష్యం చేయలేదని వైద్యాధికారి శోభారాణి చెబుతున్నారు. ఆపరేషన్ తర్వాత ఓవర్ బ్లీడింగ్ అవడంతో వెంటనే శ్రీకాకుళంలో రిమ్స్‌కు రిఫర్ చేశామన్నారు. ఈ ఘటన జరగడం తన దురదృష్టకరమని తెలిపారు.

### అభివృద్ధే లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

సంబంధించిన వినతులను ప్రజల నుంచి తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నింటిని సీఎం చంద్రబాబునాయుడు దశలవారీగా నెరవేర్చుతున్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వైసీపీ పాలనలో స్వార్థ రాజకీయాల కారణంగా రాష్ట్రం ఆర్థికంగా వెనకబడింది. రాజధాని లేని రాష్ట్రంగా తయారైంది. రాజధాని నిర్మాణానికి సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారు. హామీలన్నింటినీ శతశాతం నెరవేర్చడంతో పాటు రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమ'ని స్పష్టం చేశారు. అనంతరం దబ్బపాడు, వాడవలస గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాల్లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. వందశాతం రాయితీపై కంది, మినుము విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, మండలపార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి, కూటమి నేతలు ఎ.పోలినాయుడు, వి.ఆనందరావు, వి.గోవిందరావు, ఎస్.తేజేశ్వరరావు, టి.అప్పన్న, జె. మోహనరావుల తోపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

### డీసీసీ అధ్యక్ష పదవి నుంచి అంబటి ఔట్..

(ఐదో పేజీ తరువాయి)

ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విచారణకు ఆదేశించారు. డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు నిజమేనని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో కృష్ణారావును తక్షణమే శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి తొలగించారు. అలాగే కృష్ణారావుపై తీసుకోవాల్సిన క్రమశిక్షణా చర్యలపై మరింత లోతుగా విచారణ చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘాన్ని ఆదేశించినట్లు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి బుధవారం ప్రకటన జారీచేశారు. అవినీతి కారణంగా డీసీసీ అధ్యక్షుడ్ని తొలగించడం చర్చనీయాంశమవుతోంది.

### రేషన్ కావాలంటే.. 8 కి.మీ. వెళ్లాలి

(ఐదో పేజీ తరువాయి)

సాగిస్తున్నారు. కొత్తూరు మండలంలో అడ్డంగి, ఆర్తీతోపాటు మందస మండలంలో భావనసాయి, గుడ్డికోల, లతితపురం, మదనగుడ్డియాలి, కొండమేర గ్రామాలు కొండపై ఉన్నాయి. ఆయా గ్రామస్థులంతా రేషన్ సరుకులు తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని, కొండపైనే రేషన్ సరుకులు అందించాలని కోరుతున్నారు.

- ఈ విషయమై పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వద్ద ప్రస్తావించగా.. 'రేషన్ దుకాణాలు దూరంగా ఉండడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. వచ్చే నెల నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామ'ని తెలిపారు.

**బరువుతో ఎక్కలేక పోతున్నాం**



కొండ పైకి రేషన్ సరుకులతో ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నాం. గ్రామం నుంచి కొండపై నాలుగు కిలోమీటర్లు నడిచి ఎక్కాల్సి వస్తోంది.

\- ఎస్.జమ్మయ్య, అడ్డివాడ

**వాహనాల ద్వారా ఇవ్వాలి**



కొండపై గ్రామాలకైనా వాహనాలు ద్వారా రేషన్ సరుకులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. వృద్ధులు చాలా ఇబ్బందులు పడు తున్నారు.

\- గణేష్, అడ్డివాడ

### ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు

- ఆర్జీయూకేటీ డైరెక్టర్ బాలాజీ

ఎచ్చెర్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్‌లో పీయూసీ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను బుధవారం కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో పోటీ తత్వంతో చదివాలన్నారు. ఈ క్యాంపస్‌లో ఇంజనీరింగ్‌లో అన్ని విభాగాల్లో కలిపి 1,020 సీట్లు ఉన్నాయని, మొదటి ఐదు ర్యాంకులు బాలికలు కైవసం చేసుకున్నారన్నారు. మొదటి ర్యాంకర్ చల్లా ప్రీతి ఈఈఈ, రెండో ర్యాంకర్ బి.నిఖిల ఎలక్ట్రానిక్స్, మూడో ర్యాంకర్ పి.సింధు, నాలుగో ర్యాంకర్ ఎ.నందిని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఐదో ర్యాంకర్ కె.లక్ష్మి మాధురి కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లను ఎంపిక చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏవో డాక్టర్ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, డీన్ వెల్ఫేర్ జి.రవి, మోహన కృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మొదటి ర్యాంకర్ చల్లా ప్రీతికి బ్రాంచ్ కేటాయింపు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న క్యాంపస్ డైరెక్టర్ బాలాజీ

## న్యూస్ బాక్స్

### ఆయన నేత్రాలు సజీవం


ఆదిత్యన్ (ఫైల్)

అరసవల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): నేత్రదానం మహాదానమని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. తోటపాలెం గ్రామానికి చెందిన బీపీఏ ఎన్ ఆదిత్యన్(84) మృతి చెందగా నేత్రాలను దానం చేసేందుకు ఆయన కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి రెడ్‌క్రాస్‌కు తెలిపారు. సమాచారం అందుకున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఆదిత్యన్ నేత్రాలను సేకరించి, విశాఖ ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు తరలించారు.

### ఫరీద్‌పేటలో డీపీవో పర్యటన

ఎచ్చెర్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేటలో పలువురు జ్వరాలతో బాధపడుతుండడంతో డీపీవో భారతీ సౌజన్య బుధవారం గ్రామాన్ని సందర్శించారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఇంజ నీరింగ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ సిబ్బంది సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.హరిహరరావు, ఎచ్చెర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఉషశ్రీ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట అప్పినాయుడు, పంచాయతీ కార్యదర్శి కేశవరావు పాల్గొన్నారు.

### గాయత్రీ ఐటీఐలో ఫైర్ సేఫ్టీపై సెమినార్

అరసవల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎన్ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక గాయత్రీ ప్రైవేటు ఐటీఐలో ఫైర్ అండ్ సేఫ్టీపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ జీపీఆర్ కృష్ణ పాల్గొని మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తుకు ఉపయోగపడేలా యువకులు ఫైర్ అండ్ సేఫ్టీ రంగంలో పనిచేయాలన్నారు. డాక్టర్ పూడి కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగంలో యువత ఉద్యోగావకాశాలు ఈ రంగంలో అధికంగా ఉన్నాయని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐటీఐ అధినేత వెలమల రవికుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.

### పాము కాటుతో చిన్నారి మృతి


సన్విత(ఫైల్)

కవిటి, జూలై 9(ఆంధ్రజ్యోతి): శిల గాం గ్రామానికి చెందిన జి.సన్విత (11) పాముకాటుకు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పూడివీధిలోని తల్లి సునీతతో కలిసి ఇంట్లో సోమవారం రాత్రి నిద్రిస్తోంది. అర్ధరాత్రి సమయంలో తలపై ఏదో కరిచినట్టుగా అయింది. కొంత సమయానికి చిన్నారి సన్వితకు వాంతులు కావడంతో సోంపేట ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మంగళవారం వైద్యులు పరిశీలించి పాముకాటుగా నిర్ధారించారు. చికిత్స చేసినా ఫలితం లేకుండా పోయింది. చిన్నారి తండ్రి వామనరావు వలసకూలిగా ఇతర ప్రాంతంలో ఉంటున్నాడు. సన్విత ఇదే గ్రామంలోని పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది.

### టీజీఐ ఫ్యాక్టరీ పరిశీలన

గార జూలై 9 (ఆంధ్రజ్యోతి): సతివాడ దగ్గర ఉన్న టీజీఐ (ట్రాన్స్ వరల్డ్ గార్నెట్ ఆఫ్ ఇండియా) కంపెనీని బుధవారం పోలీస్, మైనింగ్ అధికారులు పరిశీలించారు. కొన్నేళ్లుగా మూతపడి ఉన్న ఈ కంపెనీ వద్ద ఉన్న కోట్లాది రూపాయలు విలువ చేసే మినరల్స్ (ఇసుక) 2022 నుంచి చోరీకి గురయ్యాయని ఆ కంపెనీ చైర్మన్ వైకుంఠ రాజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ వివేకానంద, మైనింగ్ డీడీ మోహనరావు, ఏపీఎండీసీ అధికారులు కంపెనీ వద్ద ఇసుక నిల్వ చేసే పరిసరాలు పరిశీలించారు.

### ఆడపిల్లలపై వివక్ష చూపొద్దు

అరసవల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి ఎస్.విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బాలికల విద్యాభివృద్ధి, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడ పిల్లలపై వివక్ష చూపవద్దని, బాలికలకు పౌష్టికాహారం, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. 'బేటీ బచావో-బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన పథకాలపై వ్యాసరచన పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన

రణస్థలం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతీ మహిళా అవగాహన కలిగి ఉండాలని జేఆర్‌పురం సీఐ ఎం. అవతారం అన్నారు. నారీశక్తి కార్యక్రమంలో భాగంగా బుధవారం వేల్పురాయి గ్రామంలో పర్యటించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే తక్షణం తెలియజేయా లన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.

# అధ్వాన రహదారులు

- మండల కేంద్రానికి వెళ్లే రోడ్లు ఇలా..
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


పొగిరి గ్రామ శివారులో ఇలా..

జి.సిగడాం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయి. పొగిరి కూడలి నుంచి సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డు గోతులతో ఉండి, వర్షపు నీరు నిలిచి ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంపై అధికారులు చిన్నచూపు చూడడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గోతుల్లో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయన్న వాదనలొస్తున్నాయి. అలాగే మండల కేంద్రం సమీపంలోని రోడ్డు దారుణంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


జి.సిగడాం సమీపంలో బీటీ రోడ్డు దుస్థితి..

# బూర్జ మండల అభివృద్ధికి కృషి

- కేంద్రం మంత్రి రామ్మోహన్ నాయుడు

బూర్జ, జూలై 9(ఆంధ్రజ్యోతి): బూర్జ మండలాన్ని అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. కేజీబీవీ అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన, కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభోత్సవం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాల అభివృద్ధి విద్యతోనే సాధ్యమన్నారు. మంత్రి లోకేశ్ విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే కూన రవి కుమార్ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు అవగాహన కలిగిన వ్యక్తి అని, ఆయన సూచనలతో మండల అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల చేస్తామన్నారు. కొల్లివలసలో ఎంపీ లాడ్స్ నుంచి బస్సు షెల్టర్ నిర్మిస్తామని హామీనిచ్చారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ కొల్లివలస నుంచి నారాయణపురం వరకు రూ.2.5 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' భాగంగా ఇంటింటికి వెళ్లి ఏడాదిలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాములు నాయుడు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో పలు ప్రాంతాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నిర్వహించారు.


శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే రవికుమార్


పలాసరూరల్: లొత్తూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, వజ్జ బాబూరావు..


కవిటి: పర్రిపుట్టుగలో కరపత్రాలిచ్చి వివరిస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్


ఎచ్చెర్ల: చిలకపాలెంలో ప్రచారం చేస్తున్న ఎంపీ కలిశెట్టి


నరసన్నపేట:ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి


శ్రీకాకుళం రూరల్: తండ్యాంవలసలో కరపత్రం ఇచ్చి వివరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

### పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత

కంచిలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన యువకులు మైక్, సౌండ్ సిస్టం, కలర్ ప్రింటర్‌లను వితరణగా అందించారు. గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నేపథ్యంలో వీటిని అందజేశారని ఎంఈవో శివరాంప్రసాద్ పేర్కొంటూ యువకులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.శారద, యువకులు వంశీ, గంగారావు, తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు కేంద్రమంత్రి పర్యటన

గార, జూలై 9(ఆంధ్రజ్యోతి): గార పంచాయతీ గార, జల్లువలస, కుమ్మరిపేట, ఆరంగి పేట గ్రామాల్లో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం పర్యటిస్తారని టీడీపీ నాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ పీస వెంకట రమణమూర్తి, మాజీ సర్పంచ్ బడగల వెంకటప్పారావు తెలిపారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' మెగా పే రెంట్స్, టీచర్స్ మీటింగ్ లలో పాల్గొంటారన్నారు.

### కళాకారులకు సత్కారం

కవిటి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అభయాంజనేయ స్వామి ఆలయంలో భజన నిర్వహించే కళాకారులను మంగళ వారం రాత్రి నిర్వాహకులు సత్కరించారు. పి.చంద్రశేఖర్, ఎ.మదు, ఎ.కృష్ణారావు, జె.లోకనాథం, ఎ.త్రివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.



### నేడు గురుపౌర్ణమి వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించేందుకు నగరంలోని ఆలయాలు, సంస్థలు సిద్ధమయ్యాయి. ఈ ఉత్సవాలను కొన్ని ఆలయాల్లో ఇప్పటికే ప్రారంభించగా మరికొన్ని చోట్ల గురువారం నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన శ్రీతరుణి కృష్ణ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా విజ్ఞాన భవన్‌లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసులు నునరాపు గణపతి శర్మకు గురు సత్కారం చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరాలయంలో షిర్డీసాయికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న సాయిగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు, మహాన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాలు విద్యుద్దీపాలతో అలంకరించారు. విశాఖ-బి కాలనీ లోని షిర్డీ సాయిని ప్రత్యేకంగా అలంకరించి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**ఇచ్ఛాపురంలో..**

ఇచ్ఛాపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం పుష్పగిరి కొండపై ఉన్న షిర్డీసాయి మందిరంలో వ్యాసపౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు, హోమాలు, ప్రత్యేక హారతులు నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొని కార్యక్రమం విజయ వంతం చేయాలని ధర్మకర్త ఉప్పాడ కృష్ణ తదితరులు కోరారు.


కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

**కలశాలతో ఊరేగింపు**

శ్రీకాకుళం కల్చరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): బొందిలీపురం షిర్డీ దర్బార్‌లో గురుపౌర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం మహిళలు 108 కలశాలతో నాగావళి నదీ తీరాన ఉన్న నాగేశ్వర ఆలయంలో శివుడికి, షిర్డీసాయికి మూల విరాట్‌కు జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

# పండుగలా మెగా పేరెంట్స్ మీటింగ్: జేసీ

గార జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పేరెంట్స్ మీటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి పలు సూచ నలను ఇచ్చారు. పాఠశాల కమిటీలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సదు పాయా లను వివరించాలని, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. కార్యక్ర మంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఐ.రఘు, తహసీల్దార్ ఎం.చక్రవర్తి ఎంఈవో నక్క రామకృష్ణ, హెచ్ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

# నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

- మంత్రి నారాయణకు ఎమ్మెల్యే ఎన్ఈఆర్ వినతి

రణస్థలం, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రి నారాయణను అమరావతిలో కలిసి వినతిపత్రం అందించారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో ఉన్న కుశాలపురం, తోటపాలెం గ్రామాలను మళ్లీ పంచాయతీలుగా మార్చేందుకు గెజిట్ నోటిఫికేషన్ ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. రావాడ, వెంకటరావుపేట పంచాయతీల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, కొవ్వాడ నిర్వాసితులకు ఆర్‌ఆర్ కాలనీ నిర్మించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎన్ఈఆర్ తెలిపారు.


మంత్రి నారాయణకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

# స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అభ్యంతరం

ఇచ్ఛాపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): పాత విద్యుత్ మీటర్ల స్థానంలో కొత్తగా స్మార్ట్ మీట ర్లు ఏర్పాటుపై వ్యాపారులు అభ్యంతరం వ్యక్తంచేస్తు న్నారు. బుధవారం పాత బస్టాండ్ జంక్షన్ వద్ద ఉన్న మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారు లకు తెలియజేయకుండా మీటర్లు మార్చడం దారు ణమన్నారు. విద్యుత్‌శాఖాధికారులు కూడా కనీసం సమాచారం ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తులతో మీటర్లు మార్చటం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఏఈ గోవిందరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ప్రభుత్వ ఆదేశాల మేరకే మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లను కేటగిరి-2, కేటగిరి-4 లకు బిగిస్తున్నారని, ఈ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ఆదాని గ్రూప్‌కు ప్రభుత్వం అప్పగించిందన్నారు.


స్మార్ట్ మీటర్

### పారిశుధ్యం మెరుగుకు పాటుపడాలి

గార జూలై 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పాటుపడాలని జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా అన్నారు. బుధవారం ఉదయం తూలుగు గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాకాలం కావడం వల్ల గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోతే అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. అందువల్ల పరిసరాలతో పాటు గ్రామ ఆరోగ్యంపై అధికారులు, ప్రజలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఐ.రఘు, ఈవోపీఆర్డీ ఎ.కూర్మారావు, పంచాయతీ కార్యదర్శి బీవీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

### హామీల అమలులో ప్రభుత్వం మోసం

ఆమదాలవలస, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేశా రని, వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యక ర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా మామిడి రైతులను పరామర్శించేందుకు వెళితే కూటమి ప్రభు త్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ పరిశీలకుడు కుంబా రవిబాబు, పలువురు నేతలు పాల్గొన్నారు.

### జాతీయవాద సిద్ధాంతం కోసం ఏబీవీపీ పోరాటం

అరసవల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): జాతీయవాద సిద్ధాంతం కోసం పోరాటం చేసే ఏబీ వీపీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని వీహెచ్‌పీ అధ్యక్షుడు లోకనాథం ఆనందరావు అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో నిర్వహించారు. ముందుగా జెండాను శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ బోర గోపి ఆవిష్కరించారు. అనంతరం సెమినార్ నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం డైరెక్టర్ వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల నుంచి మహా నగరాల వరకు విస్తరించి విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా వాటి పరిష్కారానికి ఏబీవీపీ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి రోహిత్, తాతారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మహిళల భద్రత తొలి ప్రాధాన్యం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, జూలై 9(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు జిల్లా పోలీసు శాఖ తొలి ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో నారీశక్తి కార్యక్రమం పేరిట మహిళల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ దిశగా గ్రామాలు, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా భద్రత అంశంపై ప్రజలతో మమేకం కావాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించామన్నారు. శక్తి యాప్, సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వేధింపులు, గృహహింసపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, మహిళా రక్షణకు ఉన్న చట్టాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, చైల్డ్ మ్యారేజ్ తదితర అంశాలపై సోషల్ మీడియాలో డిజిటల్ అరెస్టు వంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదంలో ఉన్న మహిళలు డయల్ 112, సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098, శక్తి యాప్‌లను వినియోగించుకోవాలని సూచించారు.

### 12, 13 తేదీల్లో బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ పూర్తి డేటాతో క్యాలెండర్‌ను విడుదల చేసినట్లు సంఘం రాష్ట్ర సభ్యుడు మెట్ట అశోక్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నారాయణ శెట్టి వెంకట్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా చాంపియన్‌షిప్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

### బీఆర్ ఏయూలో పుస్తకావిష్కరణ

ఎచ్చెర్ల, జూలై 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు రాసిన 'స్విచ్చింగ్ థియరీ అండ్ లాజిక్' పై రాసిన పుస్తకాన్ని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని బుధవారం ఆవిష్కరించారు. ఈసీఈ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఉపయోగపడేలా ఈ పుస్తకం రూపొందించడం అభినంద నీయమన్నారు.

### 14 మందికి ఫిజియోథెరపీ

ఇచ్ఛాపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): అంగవైకల్యం ఉన్నవారు నిత్యం ఫిజియోథెరపీ చేయించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బి.అమూల్య అన్నారు. బుధవారం మునిసిపాలిటీ పరిధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో 14మంది విద్యార్థులకు ఫిజియోథెరపీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ధనలక్ష్మి, సహిత ఉపాధ్యాయులు ఎస్.సూర్యం, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత లేక.. పిచ్చిమొక్కలు పెరిగి

● నిర్వహణ లేకపోవడంతో అధ్వానంగా మారిన వైనం ● ఇదీ పలాస మండలంలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల పరిస్థితి


బొడ్డపాడు పశువైద్య కార్యాలయం ఆవరణలో చెత్త, పిచ్చిమొక్కలు

పలాసరూరల్, జూలై9 (ఆంధ్రజ్యోతి):పలాస మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు పరిశుభ్రతకు నోచుకోవడంలేదు. దీనికి తోడు నిర్వహణ లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారాయి. దీంతో కార్యాలయాలకు పలు పనులపై వచ్చే ప్రజలు అవస్థలకు గురవుతున్నారు.పలాస మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో పిచ్చిమొక్కలుపెరగడంతో విషజంతువులు సంచరించే అవకాశముందని సిబ్బంది, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రోజుల తరబడి పరిశుభ్రతకు నోచుకోవడంలేదని పలువురువాపోతున్నారు. మండలంలోని బొడ్డపాడు పశువైద్యకార్యాలయం ఆవరణలో చెత్తపేరుకుపోవడంతో దుర్వాసన వెలువడుతోందని చెబుతున్నారు. వీటితో పలు ప్రభుత్వకార్యాలయాల ప్రాంగణాలు అధ్వానంగామారాయి. కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.


టెక్కలి: ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు


నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



పలాస: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

# లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

● సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు



పాతపట్నం: సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీలో నినదిస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని,కనీస వేతనం 26వేలు చెల్లించాలని పలు కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా వ్యాప్తంగాకేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయూ, ఏఐసీసీటీయూ, ఏఐకేఎంఎస్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్‌చేశారు. స్కీం వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరారు. రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసీ, రక్షణరంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్‌లకు అప్పనంగా అప్పగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని పేర్కొన్నారు.బ్యాంకులు మూతపడడంతో ఖాతాదారులు అవస్థలకు గురయ్యారు. (ఆంధ్రజ్యోతి బృందం)


ఆమదాలవలస: ర్యాలీ చేస్తున్న కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులు



ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘ నేతలు



అరసవల్లి: శ్రీకాకుళంలోని తపాలా కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, పెన్షనర్లు



రణస్థలం: రామతీర్థం జంక్షన్‌లో..

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భార్య అనుమానించిందన్న ఆవేదనతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని బుధవారం కలకలం రేపింది. రెండో పట్టణ పోలీసులకథనం మేరకు.. కోనసీమ జిల్లా ఉప్పల గుప్తం మండలం మధురపేట గ్రామానికి చెందిన మధుర శ్రావ్య, నాగేంద్ర మూడేళ్ల కిందట ప్రేమించుకొని వివాహం చేసుకుని ఉపాధి నిమిత్తం శ్రీకాకుళం వచ్చి నగరంలోని కానుకుర్తివారివీధిలో ఉంటున్నారు. వారికి ఏడాది బాలుడున్నాడు. నాగేంద్ర నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో ఆరు నెలల నుంచి పనిచేస్తున్నాడు. అయితే నాగేంద్ర వేరొక అమ్మాయితో మాట్లాడుతున్నట్టు భార్య అనుమానం వ్యక్తం చేస్తూ మంగళవారం అర్ధరాత్రి వరకు నిలదీయడంతో ఇరువురు మధ్య వివాదం పెద్దదైంది. దీంతో నాగేంద్ర మనస్తాపానికి గురై అర్ధరాత్రి దాటిన తరువాత హాల్‌లో ఉన్న ఫ్యాన్ హుక్కుకు చున్నీతో ఉరివేసుకున్నాడు. భార్య బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో మెలకువ రావడంతో లేవగా భర్త ఉరివేసుకొని ఉండడంచూసి పక్కంటి వారి సాయంతో నాగేంద్రను ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య శ్రావ్య ఫిర్యాదు మేరకు రెండో పట్టణ ఎస్ఐ సంతోష్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ముగ్గురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

పలాస, జూలై 9(ఆంధ్రజ్యోతి):రెండు వేర్వేరు కేసులకు సంబంధించి గంజాయి అక్రమంగా తరలిస్తున్న ముగ్గురి స్మగ్లర్లను అరెస్టు చేసి పలాస కోర్టులో హాజరుపరిచినట్లు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. బుధవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ పలాస రైల్వే స్టేషన్ వద్ద సమాచారం మేరకు సిబ్బంది మాటువేసి పట్టుకున్నట్లు తెలిపారు. తమిళనాడులోని తిరువల్లూరుకు చెందిన రామమూర్తి, దినేష్‌కార్తీక్ ఒడిశాకు చెందిన రింకూ వద్ద నాలుగు కిలోల గంజాయిని రూ.12వేలుకు కొనుగోలు చేసినట్లు చెప్పారు. దీన్ని చెన్నై తరలిస్తుండగా పలాస రైల్వే స్టేషన్ వద్ద పట్టుబడడంతో ఇద్దర్నీ అరెస్టుచేశామని తెలిపారు. డబ్బులు సంపాదించడానికి గంజాయి రవాణా చేస్తున్నారని చెప్పారు.మరో కేసుకు సంబంధించి ఒడిశాలోని కటక్‌కు చెందిన చిత్తరంజన్‌దాస్ పర్లాకిమిడి వద్ద కిలో గంజాయి కొనుగోలు చేసి అమ్మకానికి తీసుకువెళ్తుండగా రైల్వేస్టేషన్ వద్ద సిబ్బందికి పట్టుబడ్డారని చెప్పారు. రెండుకేసులకు సంబంధించి ముగ్గుర్ని అరెస్టుచేశామని తెలిపారు.

### ఉద్యోగాలిప్పిస్తానని మోసంచేసిన వ్యక్తి ..

శ్రీకాకుళం క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు శ్రీకాకుళంటూటౌన్ పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. విశాఖ-ఏ కాలనీకి చెందిన కొండాల లోకేశ్వరరావు నగరంలోని సూర్యమహల్ జంక్షన్ వద్ద ఏపీ స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ లిమిటెడ్‌లో కంట్రోల్ రూం ఆడిటింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్నారు. అయితే సదరు వ్యక్తి పూతి తిరుమలరావు మరో ఏడుగురికి తాను పనిచేస్తున్న శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నకిలీఅపాయింట్‌మెంట్ ఆర్డర్ పత్రాలిచ్చివారి వద్ద నుంచి 12లక్ష రూపాయలు వసూలుచేశాడు. అంతేకాకుండా వారితో 18 నెలలు పనిచేయించు కొని జీతం ఇవ్వకుండా ఉండడంతో సదరు వ్యక్తులకు అనుమానం వచ్చి నిలదీశారు. దీంతో లోకేశ్వరరావు బండారం బయటపడింది. తామంతా మోసపోయామని గుర్తించి వారిలో పూతి తిరుమలరావు శ్రీకాకుళం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ ఎస్ఐ సంతోష్. లోకేశ్వరరావును అదుపులోకి తీసుకొని విచారించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## సారా కేసులో మహిళకు జైలుశిక్ష

పలాసరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి):మండలంలోని రెంటికోటకు చెందిన కబోది తులసీకి సారా కేసులో ఏడాది జైలుశిక్షతో పాటు రూ. రెండు లక్షల జరిమానా విధిస్తూ పలాస జూనియర్ సివిల్ న్యాయాధికారి యు. మాధురి బుధవారం తీర్పువెలువరించారని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్16న అక్రమంగా ఐదులీటర్ల సారా ఆమె వద్ద ఉండడంతో అప్పటి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణారావు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని చెప్పారు. నేరం రుజువుకావడంతో జైలుశిక్ష విధిస్తూ తీర్పువెలువరించారని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో కార్యదర్శికి గాయాలు

మెళియాపుట్టి, జూలై 9(ఆంధ్రజ్యోతి):చాపర పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న చింతల అప్పారావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. బుధవారం విధులు ముగించుకొని ద్విచక్రవానంపై కోరసవాడ వెళ్తున్నాడు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని రామసాగరం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిఉన్న అప్పారావును గుర్తించి 108 వాహనం ద్వారా పర్లాకిమిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.ఈ మేరకు పర్లాకిమిడి పోలీస్‌లు కేసునమోదుచేశారు.

## సీజీఆర్ఎఫ్‌కు 23 అర్జీలు



విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్న సత్యనారాయణ

టెక్కలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో బుధవారం ఈపీడీసీఎల్ శ్రీకాకుళం సర్కిల్ పరిధిలో నిర్వహించిన సీజీఆర్ఎఫ్‌లో విద్యుత్ సమస్యలపై వినియోగదారులు 23 అర్జీలను ఆ సంస్థ ఛైర్మన్ బిసత్యనారాయణకు అందజేశారు. టెక్కలిలోని అయ్యప్పనగర్, శ్రీనివాసనగర్, సైనిక్‌నగర్, పాలకేంద్రం రోడ్డు, నందిగాం మండలంలోని లఖిదాసుపురం ప్రాంతాల్లో లోవోల్టేజ్ సమస్యలపై పలువురు అర్జీలు అందజేశారు. శ్రీనివాస్‌నగర్‌లో తన అనుమతి లేకుండా సొంత స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని టంకాలగుప్త అర్జీ ఇచ్చారు.నందిగాం మండలం కణితివూరులో శ్మశాన వాటికకు విద్యుత్‌లైన్ ఏర్పాటులో తాత్సారం చేస్తున్నారని పేడాడ అనీల్ కుమార్, టెక్కలిలోని కొత్తమ్మతల్లి వీధిలో విద్యుత్‌లైన్లపై జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని, శ్రీరామ కాలనీలో విద్యుత్ వాడకపోయినా సర్‌చార్జీల భారం పడుతోందని అర్జీలు ఇచ్చారు.కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు బి. సులేఖారాణి, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ, ఈఈ శంకరరావు, ఏడీ క్రిష్ణమూర్తి, ఏఈ మురళీకృష్ణ, కొంక్యాన కిషోర్ పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

పలాసరూరల్, జూలై9(ఆంధ్రజ్యోతి):లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని, నిబంధనలను పాటించని స్కానింగ్ సెంటర్లపై చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరిన్ హెచ్చరించారు. బుధవారం పలాస ఆర్డీవో కార్యాలయంలో మల్టీలెవల్ అప్రూవేటైడ్ కమిటీ మెంబర్స్ ఎంపికను నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా స్కానింగ్‌సెంటర్లు పాటించాలని తెలిపారు.కార్యక్రమంలో పలాస గైనకాలజిస్టు నాగసుశీల, అడ్మినిస్ట్రేటివ్ ప్రకాశరావు, డీటీ భాగ్యలక్ష్మి, ఏపీఎన్‌జీవోఎస్ అధ్యక్షుడు గోపాల్,హెచ్‌ఈవో విజయ లక్ష్మి, లీగల్ అడ్వైజర్ జగదీష్, ఛైల్డ్‌లైన్ సూపర్‌వైజరు జాస్మిన్‌కుమారి పాల్గొన్నారు.

## పేదరికం నిర్మూలనకు పంచసూత్రాలు

హరిపురం, జూలై9 (ఆంధ్రజ్యోతి): పేదరికం నిర్మూలనకు ప్రభుత్వం పంచసూత్రాలను ప్రవేశపెట్టిందని ఏపీఎం పి.కూర్మారావు తెలిపారు. బుధవారం మందస మండలంలోని వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పీ4కార్యక్రమం ప్రవేశపెట్టిందని తెలిపారు.ప్రతి సంఘానికి సంబంధించిన లెక్కలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరచాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది తారకమోహన్, కళ్యాణి, ముఖలింగం, స్వామినాయుడు, మంగమ్మ పాల్గొన్నారు.

## నగరంపల్లిలో ఎయిర్‌పోర్టును స్వాగతిస్తాం

● మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

పలాస, జూలై 9(ఆంధ్రజ్యోతి):ఉద్దానంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు పేరుతో ప్రజలకు భయాందోళనలు కలిగిస్తున్నారని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపించారు. వజ్రపుకొత్తూరు మండలంలోని నగరంపల్లి వద్ద 1800 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉందని, ఉచితంగా దాన్ని సేకరించి ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపడితే తాము స్వాగతిస్తామని తెలిపారు.బుధవారం పలాసలో నియోజకవర్గ స్థాయి వైసీపీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రజలు మూడుమార్లు ఎంపీగా గెలిపిస్తే చేసిన అభివృద్ధి ఏమిటని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ప్రశ్నించారు. మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ పోలీసులతో టీడీపీ నాయకులు రాజ్యం ఏలుతున్నారని, వారిని పక్కకు తప్పించి జనాల్లోకి వస్తే తాడేపేడో తేల్చుకుందామన్నారు. తొలుత కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీలు కె.రవి,నర్తు రామారావు పాల్గొన్నారు. కాగా కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంలకు అప్పలరాజు వ్యతిరేకులు మునిసిపల్ ఛైర్మన్ బళ్ల గిరిబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్, జుత్తు నీలకంఠం, గొర్లె వేణు, మరడ భాస్కరరెడ్డి, డబ్బీరు నాగు స్వాగతం పలికారు. కార్యక్రమానికి వీరికి ఆహ్వానం లేకపోవడంతో లక్ష్మీపురం టోల్‌గేటు వద్ద నేతలకు స్వాగతం పలికి సత్కరించారు.

## పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి: డీఎల్‌పీవో


మాట్లాడుతున్న రమణ

కోటబొమ్మాళి, జూలై 9 ( ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం కావడంతో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ సూచించారు.బుధవారం కోటబొమ్మాళి మండల పరిషత్ సమావేశం మందిరంలో ఏఎన్ఎంలు, ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది క్లోరినేషన్ ఎప్పటికప్పుడు చేయాలని తెలిపారు. తాగునీటి విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో జె.ఆనందరావు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ అధ్యక్షుల నియామకం

ఎల్.ఎన్.పేట, జులై 9(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేట పీఏసీఎస్ అధ్యక్షుడిగా కాగాన మన్మథరావును నియమిస్తూ ప్రభుత్వంఉత్తర్వులు జారీచేసింది. పెద్దకోటకు చెందిన మన్మథరావు గతంలో కూడా పీఏసీఎస్ అధ్యక్షుడిగా పనిచేశారు.

●పోలాకి, జూలై 9(ఆంధ్రజ్యోతి):పోలాకి పీఏసీఎస్ ఛైర్మన్‌గా కొల్లివలస గ్రామానికి చెందిన టీడీపీనాయకుడు బైరి భాస్కరరావును నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.భాస్కరరావు గతంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

●వజ్రపుకొత్తూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా బెండికి చెందిన కణితి సురేష్‌చౌదరిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2012 నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. సభ్యులుగా సుంకరజగన్నాథపురానికి చెందిన కె.అప్పారావును,గరుడుభద్ర పంచాయతీ మర్రిపాడుకు చెందిన రాపాక శాంతారావును నియమించారు.

●జలుమూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) చల్లవానిపేట సొసైటీ ఛైర్మన్‌గా లింగాలవలసకు చెందిన దుంగ స్వామిబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సభ్యులుగా కూన వీరన్నాయుడు, రెడ్డి జయరాంను నియమించింది. స్వామిబాబు ఇదివరలో కూడా చల్లవానిపేట సొసైటీ ఛైర్మన్‌గా పనిచేశారు. అల్లాడ సొసైటీ ఛైర్మన్‌గా తిమడాం గ్రామానికి చెందిన వెలమల చంద్రభూషణరావుని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా సనపల రామ్‌జీ, కొబగాపు వెంకటరావు నియమించారు. తిమడాం సర్పంచ్‌గా, చంద్రభూషణ జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేసారు.

## అంతిమ సంస్కారాలకు అగచాట్లు


చినవంక శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో ముళ్లపొదలు పెరిగిన దృశ్యం

వజ్రపుకొత్తూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినవంకలో అంతిమ సంస్కారాలకు అగచాట్లు తప్పడం లేదు. శ్మశానవాటికకు వెళ్లే రహదారిలో డొంకలు పెరగడంతో దారిలేకుండాపోయింది.రహదారి మధ్యలో ఉండే వంతెనపై రాళ్లుతేలడంతో మృతదేహాన్నితరలించే సమయంలో అవస్థలు తప్పడంలేదు.ఉపాధి పథకం ద్వారా రోడ్డు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

(ఆంధ్రజ్యోతి బృందం)

జిల్లాలోని నందిగాం, పాతపట్నం, కొత్తూరు, జలుమూరు, సారవకోట, సంతబొమ్మాళి, పోలాకి, వజ్రపుకొత్తూరు, నరసన్నపేట, సోంపేట, ఆమదాలవలస, ఎచ్చెర్ల మండలాల్లోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో అధికారులు ఒకప్రకటనలో పేర్కొన్నారు. చెట్ల కొమ్మలు తొలగించడం, నిర్వహణ, మరమ్మతుల పనుల దృష్ట్యా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలో గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు రైస్‌మిల్లులు, పాలకేంద్రాల నిర్వాహకులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## 15న నీలమణి దుర్గ ఆవేటి వారాలు

పాతపట్నం, జూలై9 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం గ్రామ పెద్దల నిర్ణయం మేరకు 15న నీలమణిదుర్గ ఆవేటివారాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి టి.వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు గ్రామస్థులు విజయవంతంగా నిర్వహణకు సహకరించాలని కోరారు.

## టెక్కలిలో శోభాయాత్ర

టెక్కలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో బుధవారం అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు అంగనేని ఆనంద్ ఏబీవీపీ సేవలను వివరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లాఅధ్యక్షులు నరేంద్రచక్రవర్తి, తమ్మినేని ఆనందరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మదన్, మురళి, శ్యామ్, అరవింద్, సంతోష్, ఆర్యలు పాల్గొన్నారు.

## ఉపగణాంకాధికారి బదిలీ

టెక్కలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): టెక్కలి డివిజన్ ఉపగణాంకాధికారి పీసీ నందా విజయవాడ సెక్రటేరియట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవర్నీ నియమించలేదు.

## మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

వజ్రపుకొత్తూరు, జూలై 9(ఆంధ్రజ్యోతి):కిరాణా, పాన్‌షాపుల్లో మత్తుపదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు, ఎస్ఐ నిహార్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని గరుడభద్ర తదితర గ్రామాల్లో పాన్, కిరాణాషాపుల్లో తనిఖీలు చేశారు. గంజాతీ, గుట్కా, ఖైనీలు వంటి మత్తు పదార్థాలు అమ్మకం నిషేధమని తెలిపారు. పాన్‌షాపుల్లో అమ్మకాలు చేపడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.


గరుడభద్రలోని ఓ పాన్‌షాపులో తనిఖీ చేస్తున్న సీఐ తిరుపతిరావు, ఎస్ఐ

## నత్తనడకన నీటితీరువా వసూళ్లు

● జిల్లాలో పేరుకుపోయిన రూ.20 కోట్ల 27 లక్షల బకాయిలు

టెక్కలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటితీరువా బకాయిల వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. పాత, కొత్త బకాయిలు కలిపి కోట్ల రూపాయల్లో పేరుకుపోయాయి. నీటితీరువా వసూళ్లకు రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించకపోవడం సిబ్బంది కొరత, తదితర సాంకేతిక కారణాల వల్ల బకాయిలు పేరుకుపోతున్నాయి. టెక్కలి డివిజన్‌లోని టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలు, పలాస డివిజన్‌లో పలాస, నందిగాం మండలాలు, శ్రీకాకుళం డివిజన్‌లో రణస్థలం,ఆమదాలవలస, గార, సరుబుజ్జిలి, శ్రీకాకుళంతదితర మండలాల్లో ఎక్కువగా బకాయిలు ఉన్నాయి. టెక్కలి డివిజన్‌కు సంబంధించి రూ.4కోట్ల62లక్షలు, పలాస డివిన్ రూ.2కోట్ల51లక్షలు, శ్రీకాకుళం డివిజన్ రూ.13కోట్ల13లక్షలు బకాయిలు రావల్సిఉంది. జిల్లాలో ఎరియర్స్‌తో కలిపి రూ.20కోట్ల27లక్షల34వేలు బకాయిలు ఉన్నాయి. ఇటీవల రూ.3కోట్ల88లక్షలు నీటితీరువా రెవెన్యూ సిబ్బంది వసూలుచేశారు. గత ఏడాది నీటితీరువా వసూళ్లకు సాంకేతిక సమస్యలు ఏర్పడడంతో కొంత తాత్సారం ఏర్పడింది. నీటితీరువా వసూళ్లపై జేసీ స్థాయి అధికారి రెవెన్యూ సిబ్బందికి తరచూ దిశ నిర్దేశిస్తూనే ఉన్నారు. అయినా మండల స్థాయిలో నీటితీరువా వసూళ్లలో రెవెన్యూ సిబ్బంది తాత్సారం ప్రదర్శిస్తున్నారు. కాగా నీటితీరువా వసూళ్లకు స్పెషల్‌డ్రైవ్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి తెలిపారు.

## మట్టి నమూనాల సేకరణకు సహకరించండి

వజ్రపుకొత్తూరు,జూలై 9(ఆంధ్రజ్యోతి ):ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా ఢిల్లీ నుంచి వచ్చే మట్టి నమూనాలు సేకరణ బృందాలకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ సీతారామయ్య, సీఐ తిరుపతిరావుకోరారు.మంగళవారం మోట్టూరులో గ్రామ స్థులతో మాట్లాడారు. మట్టినమూనాలు సేకరణ తరువాత వచ్చే ఫలితాలు ఆధారంగా ప్రజాభిప్రాయసేకరణ ఉంటుందని తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం జరిగితే తీర ప్రాంతం అభివృద్ధిచెందడమే కాకుండా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. అనంతరం రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నిహార్, సర్వేయర్ తిరుపతిరావు పాల్గొన్నారు.


మోట్టూరులో గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

## రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి


నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు

పలాస రూరల్, జూలై9 (ఆంధ్రజ్యోతి):పెండింగ్‌లో ఉన్న రూ.4200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, ఏఐఎస్ఎఫ్‌జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి డిమాండ్ చేశారు. బుధవారం పలాస తహసీల్దార్‌కార్యాలయం ఆవరణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సందర్భంగా మాట్లాడుతూ ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. జీవో-77ను రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, నిలిచిన పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కళ్యాణచక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాయి, జిల్లా సహాయకార్యదర్శి హరికృష్ణ, సమితి సభ్యులు సోమేశ్,రాహుల్ పాల్గొన్నారు.

## పేరెంట్స్ మీటింగ్ విజయవంతం చేయాలి

కోటబొమ్మాళి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్స్ మీటింగ్‌ను ఉపాధ్యాయులు, అధికారులు విజయవంతం చేయాలని టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి కోరారు. బుధవారం మండలంలోని యలమంచిలి ప్రభుత్వ పాఠశాలలో గురువారం జరగనున్న మెగా పేరెంట్స్ ఉపాధ్యాయుల మీటింగ్ ఏర్పాట్లను తహసీల్దార్ ఆర్. అప్పలరాజుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఆర్. గడ్డెమ్మ, ఎంపీడీవో కె. ఫణీందకుమార్, ఎంఈవో ఎల్వీ. ప్రతాప్ పాల్గొన్నారు.

●నరసన్నపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): మేగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి జయదేవి సూచించారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లును పరిశీలించారు. తొలుత ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో ఉప్పాడ శాంతారావు, పి. దాలినాయుడు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పవన్ పాల్గొన్నారు.